క్లుప్తంగా

ప్రొసీడింగ్ కాపీ అందజేత



ప్రొసీడింగ్ అందిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

మల్యాల: మండలంలోని తక్కళ్లపల్లిలోని గౌడ సామాజిక వర్గం సంఘ భవన నిర్మాణానికి రూ.4 లక్షల నిధులు మంజూరయ్యాయి. బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ క్యాంపు కార్యాలయంలో ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొండపల్కల రాంమోహన్‌రావు, సర్పంచ్ గొడుగు కుమార స్వామి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, గౌడ సంఘం అధ్యక్షుడు నర్సగౌడ్, ఏఎంసీ డైరెక్టర్ సుధాకర్ గౌడ్ పాల్గొన్నారు.

హరితహారంలో ప్రజలు భాగస్వాములవ్వాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న చైర్ పర్సన్

మెట్‌పల్లి: ప్రజల భాగస్వామ్యంతోనే హరితహారం విజయవంతమవుతోందని మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మొక్కల పంపిణీ చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పూలు, పండ్లతో పాటు ఇతర మొక్కలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలకు తమకు అవసరమైన వాటిని తీసుకెళ్లాలన్నారు. కేవలం మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

మేడిపెల్లిలో మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కథలాపూర్: ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను బుధవారం మేడిపెల్లిలో కాంగ్రెస్ నాయకులు దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. వ్యవసాయం గురించి తెలియని కేటీఆర్ మితిమీరి మాట్లాడుతున్నారన్నారు. రాహుల్‌గాంధీ గురించి మాట్లాడే అర్హత కేటీఆర్‌కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, నాయకులు ఏనుగు రమేశ్‌రెడ్డి, లక్ష్మణ్, ముంజ కిషన్, శ్రీపతి దామోదర్, జలందర్‌రెడ్డి, స్వామి, అరుణ్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ



పెగడపల్లిలో తనిఖీ చేస్తున్న ఏఈవో

పెగడపల్లి: మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను ఏవో వినీల బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువులు, క్రిమిసంహారక మందులను ఆమె పరిశీలించి నమూనాలు సేకరించి మాట్లాడారు. ఎరువుల ధరలు పెంచి విక్రయించకూడదని, రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు బిల్లులివ్వాలని దుకాణంలో ధరల పట్టిక ప్రదర్శించాలని పేర్కొన్నారు. ఏఈవో సరోజిని ఆమె వెంట ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న జువ్వాడి కృష్ణారావు

మల్లాపూర్: మండలంలోని సాతారంలో బాధిత కుటుంబాలను బుధవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పరామర్శించారు. గ్రామానికి చెందిన కురుమ తిరుపతిరెడ్డి తల్లి, గట్ల సత్తయ్య ఇటీవల మృతి చెందగా, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు చెక్కపల్లి కిషన్‌గౌడ్, నర్సయ్య, మురళి, బడే భూమయ్య పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెంపు లక్ష్యంగా..

- ఓటింగ్‌పై ప్రజలకు అవగాహన
- జిల్లా వ్యాప్తంగా ఆరు మొబైల్ వ్యాన్లు
- నేటి నుంచి 2 నెలలు గ్రామాల్లో పర్యటన



ప్రచారానికి సిద్ధంగా ఉన్న మొబైల్ వ్యాన్

కోరుట్ల: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌పై ఓటు వేయడంలో ఇప్పటికీ చాలా మంది ఓటర్లలో అయోమయం ఉంది. పోలింగ్ బూతుల్లోకి వెళ్లిన తరువాత ఎన్నికల సిబ్బంది సహాయం తీసుకునే వారి సంఖ్య ఇంకా తగ్గలేదు. అంతే కాకుండా కొత్త ఓటర్లకు ఈవీఎంల వినియోగంపై అవగాహన అవసరముంది. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకుని ఎన్నికల కమిషన్ ఈ సారి మొబైల్ వ్యాన్లతో ఈవీఎంలో ఓటు వేయడంపై ఓటర్లకు పూర్తిస్థాయి అవగాహన కల్పించడానికి ఏర్పాట్లు చేసింది. ఫలితంగా ఓటింగ్ శాతం పెంపు ఉంటుందన్న నమ్మకంతో ఎన్నికల కమిషన్ ఉంది.

జిల్లాలో 6 మొబైల్ వ్యాన్లు..

జగిత్యాల జిల్లాలో ఆరు మొబైల్ వ్యాన్లతో ఈవీఎంలలో ఓటింగ్ ఎలా వేయాలన్న అంశంపై ప్రజల్లో అవగాహన కోసం ఏర్పాట్లు చేశారు. ఈ మొబైల్ వ్యాన్లలో ఓ పోలీసు శాఖ నుంచి ఒకరు, రెవెన్యూ శాఖ నుంచి ఒకరు ఉంటారు. గ్రామ పంచాయతీల వద్ద మొబైల్ వ్యాన్లను నిలిపి అక్కడకి ఓటర్లను సమీకరించి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ పనితీరుపై అవగాహన కల్పిస్తారు. ఓటింగ్ మిషన్‌లో మీట ఎలా నొక్కాలి. ఓటు నమోదు కోసం బీప్ వచ్చే తీరు.. నమోదు తరువాత ధ్రువీకరణ ఏలా చేసుకోవాలన్న విషయంపై ఓటరుకు అవగాహన కల్పిస్తారు. ఓటర్ల సమీకరణ కోసం గ్రామ పంచాయతీ పరిధిలోని సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు, యువజన సంఘాలు, ఇతరత్రా సంస్థల నుంచి సాయం తీసుకోవడానికి ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి షురూ..

గురువారం నుంచి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన కోసం అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. జగిత్యాల జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవో కార్యాలయల్లో ఒక్కో చోట ఒక్కో మొబైల్ వ్యాన్ సిద్ధంగా ఉంచుతున్నారు. అంతే కాకుండా జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి సెగ్మెంట్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో పర్యటించడానికి మరో మూడు మొబైల్ వ్యాన్లు సిద్ధం చేశారు. ఆర్డీవో కార్యాలయాల వద్దకు కొత్త ఓటర్లను తరలించి వారికి ఓటింగ్‌పై వారికి అవగాహన కల్పిస్తారు. అంతేకాకుండా జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో రోజు ఒక గ్రామం చొప్పున ఆయా సెగ్మెంట్లకు అలాట్ చేసిన మొబైల్ వ్యాన్లు పర్యటిస్తాయి. నేటి నుంచి రెండు నెలల పాటు ఈ మొబైల్ వ్యాన్లతో ఓటింగ్‌పై అవగాహన కల్పించే కార్యక్రమం కొనసాగనుంది. ఈ కార్యక్రమం ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంపు కోసం ఎంతగానో దోహదపడుతుందనడంలో ఎలాంటి సందేహాలు లేవు.

ఓటింగ్ శాతం పెంపు కోసమే



ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంపు లక్ష్యంగా ఎన్నికల కమిషన్ మొబైల్ వ్యాన్లతో ఈవీఎం ఓటింగ్‌పై అవగాహన కల్పించడానికి ఏర్పాట్లు చేసింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం నుంచి ఈ మొబైల్ వ్యాన్లు గ్రామాలకు వెళతాయి. ఓటర్లకు అవగాహన కల్పించేందుకు పనిచేస్తాయి.

రాజేశ్,
తహసీల్దార్, కోరుట్ల

రాష్ట్రంలో వ్యవసాయం పండుగైంది

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



కోనాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సారంగాపూర్: ఒకప్పుడు వ్యవసాయం చేయాలంటేనే రైతులు భయపడేవారని, ఇప్పుడు సీఎం కేసీఆర్ రైతు సంక్షేమ పథకాలతో వ్యవసాయం పండుగైందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కోనాపూర్ రైతువేదికలో రైతులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చాక రైతాంగానికి 24 గంటల విద్యుత్‌తో పాటు, సరిపడా ఎరువులు, పెట్టుబడి కింద పంటకు ఎకరాకు రూ.5 వేలు అందించడంతో వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. కాంగ్రెస్ పాలనలో లోవోల్టేజీతో విద్యుత్ మోటర్లు కాలిపోవడం, రైతులు సాగునీరు అందలేదన్నారు. 3 గంటల కరెంట్‌పై కాంగ్రెస్ నాయకులను గట్టిగా నిలదీయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కోల జమున, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ సొల్లు సురేందర్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ కోల శ్రీనివాస్, సింగిల్‌విండో చైర్మన్ గుర్నాథం మల్లారెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గుర్రాల రాజేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటికే సంక్షేమం.. ప్రతీ ముఖంలో ఆనందం

జగిత్యాల: ఇంటి వద్దకే సంక్షేమం అందిస్తూ ప్రతి ముఖంలో ఆనందం చూడటమే సీఎం కేసీఆర్ లక్ష్యమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం పలువురికి సీఎం సహాయనిధి కింద మంజూరైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ముస్కు నారాయణరెడ్డి, క్యాదాసు నవీన్, మహేశ్, రామకృష్ణరెడ్డి పాల్గొన్నారు.

నిరుపేదలకు కంటి శస్త్ర చికిత్సలు

నిరుపేదలకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాల నియోజకవర్గంలోని 17 మంది నిరుపేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేశారు. కార్యక్రమంలో నాయకులు దుమాల రాజ్‌కుమార్, రంగు మహేశ్, శ్రీనివాస్, కిశోర్, విజయ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలానికి చెందిన ఏడుగురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ లబ్ధిదారులకు అందజేశారు.. కార్యక్రమంలో జెడ్పీటీసీ మహేశ్, దావ సురేశ్, బొడ్డు బుచ్చన్న, మహేశ్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం కోరేది కేసీఆర్ ప్రభుత్వమే



మాట్లాడుతున్న డాక్టర్ సంజయ్

ఇబ్రహీంపట్నం: రైతుల సంక్షేమం కోరేది సీఎం కేసీఆరేనని బీఆర్‌ఎస్ యువ నాయకుడు కల్వకుంట్ల సంజయ్ అన్నారు.మండలంలోని గోధూర్ రైతువేదికలో బుధవారం నిర్వహించిన రైతు సదస్సులో పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఒక రైతు బిడ్డ కాబట్టి రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, రైతులకు 24 గంటల విద్యుత్, రైతుబంధు పథకం, రైతు బీమా పథకం ఇస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, సర్పంచ్ సోమ ప్రభాకర్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ సుగుణాకర్‌రావు, ఉపసర్పంచ్ తిరుపతిరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు చిన్నారెడ్డి, నాయకులు జేడీ సుమన్, ఎంపీటీసీలు, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

కోరుట్లలో గడపగడపకూ సంజయన్న..

కోరుట్ల: పట్టణంలోని 28వ వార్డులో బుధవారం గడపగడపకూ సంజయన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల సంజయ్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, స్థానిక కౌన్సిలర్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



సైకిళ్లు పంపిణీ చేస్తున్న కొప్పుల స్నేహలత

వెల్గటూర్: ఎల్‌ఎం. కొప్పుల సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో వెల్గటూర్ మండలం జగదేవ్‌పేటలో 20 మంది నిరుపేద విద్యార్థులకు సంస్థ చైర్ పర్సన్ కొప్పుల స్నేహలత చేతుల మీదుగా సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్నేహలత మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత విద్యావంతులుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వెల్గటూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, ఎంఈవో బత్తుల భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండలంలోని గోవిందుపల్లిలో విద్యార్థులకు మంత్రి కొప్పుల ఈశ్వర్ సతీమణి, ఎల్‌ఎం కొప్పుల సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ చైర్‌పర్సన్ స్నేహలత సైకిళ్ల అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకరవ్వ, జెడ్పీటీసీ జలేందర్, ఎంపీపీ నక్క శంకర్, వైస్ ఎంపీపీ ఆవుల సత్యం, పీఏసీఎస్ చైర్మన్ వెంకట మాధవరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బొల్లం రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దు

ఇబ్రహీంపట్నం: వర్షాలు కురుస్తున్నప్పుడు విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దని విద్యుత్ ఏఈ సతీశ్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. తడిసిన కరెంట్ స్తంభాలను తాకవద్దని విద్యుత్‌లైన్‌కు తగులుతున్న చెట్లను, పార్కుల్లో కాని, స్టేడియంలో గాని విద్యుత్ స్తంభాలను చేతులతో తాకోద్దని, ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టుకోవద్దని తెలిపారు. బయట పెట్టిన లైట్లు నీటితో తడవకుండ చూసుకోవాలని తెలిపారు. ఉరుములు, మెరుపులతో వర్షం పడేటప్పుడు డిష్ కనెక్షన్ తీసివేయాలని, టీవీ, ఫ్రిజ్ , కంప్యూటర్ల స్విచ్‌లను ఆపివేయాలని కోరారు.

27న జగిత్యాలలో ఎమ్మార్పీఎస్ మహాసభ



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కథలాపూర్: ఈనెల 27న జగిత్యాలలో ఎమ్మార్పీఎస్ మహాసభ నిర్వహిస్తున్నట్లు జిల్లా కో కన్వీనర్ సురేశ్ తెలిపారు. మేడిపెల్లి మండలం తొంబర్రావుపేటలో ఎమ్మార్పీఎస్ నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ సాధనకు ఉద్యమిద్దామని, ఉద్యమకారులు అధిక సంఖ్యలో జగిత్యాల సభకు తరలిరావాలన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికలప్పుడు ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇచ్చి ఆ తర్వాత విస్మరిస్తున్నాయని మండిపడ్డారు. సభకు అన్ని గ్రామాల నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. సమావేశంలో నాయకులు ప్రవీణ్‌కుమార్, కుంటాల శ్రీనివాస్, శేఖర్, సంజీవ్, విజయ్, చిట్యాల తిరుపతి, పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోరుట్ల: పట్టణంలో బిందేశ్వరి ప్రసాద్ మండల్ యాదవ్ విగ్రహ ఏర్పాటుకు స్థలం, అనుమతి ఇవ్వాలని తెలంగాణ బహుజన గళం ప్రజా సేవా సమితి ఆధ్వర్యంలో బుదవారం మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆర్టికల్ 340 ప్రకారం బీసీ, ఓబీసీలకు రిజర్వేషన్ల అమలు కోసం దేశ వ్యాప్తంగా అలుపెరుగని పోరాటం చేశారని అన్నారు. అలాంటి మహనీయుని విగ్రహం ఏర్పాటుకు అనుమతితోపాటు స్థలం మంజూరు చేయాలని కోరారు.కార్యక్రమంలో బీసీ, ప్రజా సంఘాల, అంబేడ్కర్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

పెగడపల్లి:మండలంలోని ఉప్పుపల్లె అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో పుల్లయ్య బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు రిజిష్టర్, సరుకుల నిల్వలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల సంఖ్యను పెంచాలని సూచించారు. కేంద్రం నుంచి అందుతున్న సేవలను అర్హులైన వారు వినియోగించుకునేలా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ టీచర్ సుహాసిని పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మికత పెంచుకోవాలి



పూజల్లో పాల్గొన్న మహిళలు

జగిత్యాలరూరల్: ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడుస్తూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని 108 శ్రీచక్ర సహిత లలితమాత ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ చెల్లం స్వరూప అన్నారు. బుధవారం రూరల్ మండలం పొలాస శ్రీలలితమాత అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో మహిళలు మణిద్వీపవర్ణన పారాయణం చేశారు. అనంతరం శ్రీచక్రాలకు సుహాసినిలు కుంకుమార్చన చేశారు. కార్యక్రమంలో జిడిగె లక్ష్మీనారాయణ, మార రాజేశం, రమణయ్య, సత్తయ్య, సతీశ్, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

వర్షంలోనూ పంచాయతీ కార్మికుల నిరసన



ఇబ్రహీంపట్నంలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఇబ్రహీంపట్నం: పంచాయతీ సిబ్బంది డిమాండ్లను పరిష్కరించాలని చేస్తున్న సమ్మెలో భాగంగా 14వ రోజు ఇబ్రహీంపట్నం మండల పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ సిబ్బంది వర్షంలో తడుస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది సంఘం మండల అధ్యక్షుడు జగన్, ఉపాధ్యక్షుడు అనంత్‌కుమార్, కోశాధికారి నిరేటి రతన్, సభ్యులు పాల్గొన్నారు.

సార్.. మా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి

సారంగాపూర్: సార్ మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని గ్రామపంచాయతీ కార్మికులు బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి కోరారు. సమస్యల పరిష్కారానికి 14 రోజుల నుంచి సమ్మె చేస్తున్నామని, మల్టీపర్పస్ విధానం రద్దు చేసి, సమాన పనికి సమాన వేతనం కల్పిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రెండు మండలాల కార్మికులు, సంఘం నాయకులు ఉన్నారు.

నులి పురుగుల నిర్మూలనకు కృషి చేయాలి



రాయికల్‌లో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

రాయికల్: మండలంలోని ప్రతి ఒక్క చిన్నారికి తప్పనిసరిగా నులిమాత్రలు వేయించాలని వైద్య సిబ్బందిపై ఉందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బందికి శిక్షణ సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో ఏఎంవో సత్యనారాయణ, ఎన్‌సీడీ మురళీ, డాక్టర్ దీప్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: నులిపురుగుల నిర్మూలనకు కృషి చేయాలని వైద్యాధికారి శ్రీజ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 1 నుంచి 19 ఏళ్ల లోపు వారికి అల్బెండా జోల్ మాత్రలు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభు, సీహెచ్‌వో విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి: గురువారం నిర్వహించే జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి నరేశ్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడి టీచర్లు, ఆరోగ్య సిబ్బందితో బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. మండల వ్యాప్తంగా 6090 మంది అర్హులను గుర్తించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వెల్గటూర్: నులిపురుగుల నిర్మూలనకు 19 ఏళ్లలోపు వారికి మాత్రలు వేయాలని వైద్యాధికారి రమేశ్ అన్నారు.ఎంపీడీవో కార్యాలయంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బుగ్గారం: నులి పురుగుల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జెడ్పీటీసీ బాదినేని రాజేందర్ అన్నారు. మండలంలోని నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి రవి శంకర్ ఆధ్వర్యంలో అధికారులు, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు.

సంక్షిప్త వార్తలు

ఎస్సారెస్పీ నీటి విడుదల తేదీలను ప్రకటించాలి

మెట్‌పల్లి: ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచి నీటి విడుదలకు సంబంధించిన తేదీలను అధికారులు ప్రకటించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి బుధవారం కోరారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల రైతులు వరి నారుమళ్లను సిద్ధం చేసుకుంటున్నారని, అధికారులు సమావేశం ఏర్పాటు చేసి నీటి విడుదల తేదీలను ప్రకటిస్తే..రైతులు అందుకనుగుణంగా సాగు పనులు చేసుకుంటారని పేర్కొన్నారు.

'కాంగ్రెస్ హయాంలోనే పసుపు రైతులకు మేలు'

మెట్‌పల్లి: కాంగ్రెస్ హయాంలోనే పసుపు రైతులకు మేలు జరిగిందని పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తన హయాంలో పసుపుకు మద్దతు ధర అందించి రైతులను ఆదుకున్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మద్దతు ధరను అందించకపోవడం వల్ల రైతులు ప్రతి యేటా తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వరంగల్‌లో ప్రకటించిన కాంగ్రెస్ రైతు డిక్లేరేషన్‌లో పసుపుకు రూ.12వేల మద్దతు ధర అందిస్తామని హామీ ఇచ్చిందన్నారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌కు పలువురు పరామర్శ

కథలాపూర్: మండలం దూలూర్ గ్రామానికి చెందిన ఏఎంసీ చైర్‌పర్సన్ గుండారపు సౌజన్యను బుధవారం పలువురు నాయకులు పరామర్శించారు. సౌజన్య మామ బక్కన్న అనారోగ్యంతో మంగళవారం మృతిచెందగా, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చల్మెడ లక్ష్మినరసింహారావు, నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి, జెడ్పీటీసీ నాగం భూమయ్య బాధితకుటుంబాన్ని పరామర్శించారు.

డ్రమ్ సీడర్ విధానంతో రైతులకు లాభం

సారంగాపూర్: డ్రమ్ సీడర్ విధానంతో వరి పంట సాగుచేసే రైతులకు లాభదాయకంగా ఉంటుందని బీర్‌పూర్ మండల వ్యవసాయాధికారి అనూష అన్నారు. బుధవారం బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లెలో సూద రమేశ్ అనే రైతు పొలంలో డ్రమసీడర్ విధానంతో వరి సాగుచేసే పద్ధతిపై అవగాహన కల్పించారు. ఈ విధానంతో రైతులకు ఎకరాకు తక్కువ విత్తనాలు, కూలీల ఖర్చు ఉండదని, నీటి యాజమాన్య పద్ధతులు సక్రమంగా పాటిస్తే అధిక దిగుబడి వస్తుందన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

మల్లాపూర్: మండలంలోని వేంపల్లిలో బుధవారం అనారోగ్యంతో ఇస్లావత్ భూదమ్మ(90) అనే వృద్ధురాలు మృతి చెందగా, సర్పంచ్ బిట్ల సరోజన, ఎంపీటీసీ గుగ్లావత్ భూమి, ఉపసర్పంచ్ వెల్మల రాజనర్సయ్య వార్డుసభ్యులు దహన సంస్కారాలకు రూ.10వేల ఆర్థికసహాయాన్ని అందించారు.

నిరుపేద కుటుంబానికి సాయం

ఇబ్రహీంపట్నం: మండలంలోని డబ్బా గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన నాంపెల్లి సుగుణ అనారోగ్యంతో బాధపడుతున్నందున ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ సభ్యులు 25 కిలోల బియ్యం, నెలకు సరిపడా నిత్యవసర సరుకులను అందచేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్‌గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

తపస్ ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు ప్రారంభం

కథలాపూర్: మేడిపల్లి మండలంలోని కొండాపూర్, రంగాపూర్ ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) సభ్యత్వ నమోదు చేపట్టారు. ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులతో సభ్యత్వం చేయించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తపస్ మండలాధ్యక్షుడు మల్హల్‌రావు, ప్రధానకార్యదర్శి గంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు అవగాహన ఉండాలి

కోరుట్ల: బూత్ లెవల్ ఆఫీసర్లు ఓటరు నమోదు, తొలగింపు,సవరణలపై పూర్తి అవగాహన ఉండాలని తహసీల్దార్ నీరటి రాజేశ్ అన్నారు. ఓటరు నమోదు, సవరణ తదితర అంశాలపై బూత్‌లెవల్ అధికారులకు బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంటింటా సర్వేలో భాగంగా వయోజనులందరినీ ఓటరుగా నమోదు చేసేందుకు కృషి చేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించాలని పేర్కొన్నారు. వయోజనులకు అవగాహన కల్పించి ఓటు హక్కు కల్పించాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు శివప్రసాద్, కృష్ణమోహన్, ఆయా గ్రామాల బీఎల్‌వోలు పాల్గొన్నారు.

పాఠశాలలో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు

కథలాపూర్: భీమారం మండలం గోవిందారం జెడ్పీ హైస్కూల్‌లో ప్యాట నారాయణ సహకారంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను బుధవారం ప్రారంభించారు. విద్యార్థులకు శుద్ధమైన తాగునీరందించాలని రూ. 1.50 లక్షలు వెచ్చించి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించారని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా నారాయణను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నెల్లుట్ల పూర్ణిమ, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ జుంబర్తి సంజీవ్, తోకల నర్సయ్య, దేవయ్య, ప్యాట వెంకటేశ్, హెచ్‌ఎం రాజేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నియామకం

రేచపల్లి రజక సంఘం అధ్యక్షుడిగా తిరుపతి

సారంగాపూర్: మండలంలోని అతిపెద్ద గ్రామపంచాయతీ రేచపల్లిలో బుధవారం రజకులు సమావేశం నిర్వహించి సంఘ అధ్యక్షుడిగా కందుకూరి తిరుపతి, ఉపాధ్యక్షుడిగా కలకోట ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా సంద సతీశ్, కోశాధికారిగా సంద తిరుపతి, గౌరవ సలహాదారుగా రాచకొండ రాజేశం నియమితులయ్యారు.